క్లుప్తంగా

అక్షర ఆంధ్ర వలంటీర్లకు శిక్షణ



రాయవరం మండల మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు

రాయవరం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం అక్షర ఆంధ్ర వలంటీర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మండల సమాఖ్య ఏపీఎం కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభించిన శిక్షణలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని 47 గ్రామ సంఘాల నుంచి ప్రతి గ్రామ సంఘం నుంచి ముగ్గురు వలంటరీ టీచర్ల వంతున మొత్తం 141 మంది వలంటీర్లను, ఎన్ఆర్ఈజీఎస్ నుంచి 11 సంఘాల నుంచి 41 మంది వలంటరీ టీచర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. ఒక రోజు మండల స్థాయి శిక్షణలో భాగంగా వలంటరీ టీచర్లకు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లెర్నర్స్‌కు అవసరమైన పాఠ్య పుస్తకాలు అందించారు. మండల మహిళా సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్ నాజర్ హుస్సేన్, ఆయా గ్రామాల వలంటరీ టీచర్లు, ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ కూలీలు, డ్వాక్రా మహిళలు, వీవోఏలు పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన జీవితం



వెదురుమూడిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కపిలేశ్వరపురం: పోషకాహారం తీసుకోవడం ద్వారా మెరుగైన జీవితాన్ని గడపవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి అన్నారు. మండపేట ప్రాజెక్ట్ అంగర సెక్టార్ పరిధిలోని వెదురుమూడి బీసీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.జానకీదేవి, వి.నాగమణి గ్రామంలోని గర్భిణులకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ అందజేసి సీమంతం చేశారు. సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ప్రాధాన్యాన్ని వివరించారు. గ్రామ కార్యదర్శి శారద మాట్లాడుతూ అంగన్‌వాడీలు అందజేసే ఆహారాన్ని, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ నాయకులు బోణం నానిబాబు, శ్రమ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రమణయ్య, దుర్గారావు, అంగన్‌వాడీ సహాయకురాలు వి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సామాన్య ప్రజలతో మమేకం కావాలి

కపిలేశ్వరపురం (మండపేట): సామాన్య ప్రజలతో మమేకం కావడం ద్వారా వైఎస్సార్ సీపీ లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట విజయలక్ష్మినగర్‌లోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం పార్టీ కార్యకర్తలతో పలు సామాజిక సమస్యలపై చర్చించారు. మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనతో సామాన్య ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు తోడుగా నిలవడం ద్వారా పార్టీని బలోపేతం చేసుకోవాలని సూచించారు.

విద్యలో మెళకువలు పాటించాలి

కె.గంగవరం: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో మెళకువలు పాటించి విద్యాబోధన చేయాలని ఎంఈఓ నాగరాజు అన్నారు. మండలంలోని మసకపల్లి, భట్లపాలిక గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత పాఠశాల రికార్డులు, హాజరు శాతాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు దాతలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను, సదుపాయాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యతో పాటు పౌష్టికాహారం రుచిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించండి

మామిడికుదురు: హిందువులు దేశం కోసం పోరాడుతున్నారని, మనం నిర్మించుకున్న దేవాలయాలను శక్తి కేంద్రాలుగా మార్చాలన్న కార్యాచరణకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని విజయవాడ ప్రాంత సహ సంయోజక్ తులసీ సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆది జాంబవ సమావేశం జరిగింది. మన దేవాలయాలను మనం పరిరక్షించుకునేందుకు కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించాలన్నారు. ప్రతి ఒక్క హిందువు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ వాకాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలతో సహవాసం

- ప్రజలకు వెలుగు దివ్వెల కనువిందు
- దేశవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలకు ఇక్కడి నుంచే సరఫరా
- ప్రముఖుల ఇళ్లకు సైతం ఇక్కడి నుంచే



బాణసంచా తయారీలో నిమగ్నమైన పెద్దిరెడ్డి సూరిబాబు (ఫైల్)



ద్రాక్షారామలో బాణసంచా విక్రయ దుకాణం

రామచంద్రపురం రూరల్: బ్రిటిష్ వారి కాలం నుంచి మందుగుండు తయారీ కేంద్రాలు రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామ కేంద్రంగా వెలుగులు పంచుతున్నాయి. తాము ప్రమాదాలతో సహవాసం చేస్తూనే ప్రజలకు దీపావళి పండుగలో వెలుగులు పంచే మతాబులు, చిచ్చుబుడ్లు, కేండిల్స్, గ్రీన్‌లైట్లు, బీటు బుడ్లు, ముత్యాల తాళ్లు, పేక జువ్వ, సిసింద్రీలు తదితర దీపావళి సామానుతో పాటు ఫంక్షన్లకు ప్రత్యేకంగా తయారు చేసే ఈత చెట్లు, బేటరీ బాక్స్‌లు, డబుల్ వీల్, జపాన్ రింగ్, సర్పాలు తదితర ప్రత్యేక అంశాలు తయారు చేస్తూ పదుల సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నాయి. ఆ తయారీ కేంద్రాల చరిత్ర, వారి అనుభవాలపై 'సాక్షి' పరిశీలన..

రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ కేంద్రంగా బ్రిటిష్ వారి కాలంలో మద్రాస్ నుంచి ఎక్స్‌ప్లోజివ్ లైసెన్స్‌ను సంపాదించి నక్కా వెంకన్న, సుబ్బన్న సోదరులు బాణసంచా తయారీ కేంద్రాన్ని నిర్వహించేవారు. వారి తరువాత కాలంలో వారి మేనల్లుడు పెద్దిరెడ్డి సుబ్బారావు వారి వద్ద నేర్చుకుని సయ్యద్ షాబాజ్ ఔలియా బాబా ఫైర్ వర్క్స్ పేరుతో తయారీ కేంద్రాన్ని స్థాపించారు. ఆయన నుంచి వారసత్వంగా ఆయన కుమారులు వీర్రాజు, రాంబాబు, సూరిబాబులు తయారీ రంగంలో నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం సయ్యద్ షాబాజ్ ఔలియా బాబా ఫైర్ వర్క్స్ కేంద్రాన్ని పెద్దిరెడ్డి రాంబాబు కొనసాగిస్తుండగా, పెద్దిరెడ్డి సూరిబాబు శ్రీఆంజనేయ ఫైర్ వర్క్స్ తయారీ కేంద్రాన్ని భారీగా విస్తరించారు. అనతికాలంలో జువ్విపాడులో జిల్లెల ధర్మయ్య బాణసంచా తయారీని ప్రారంభించగా వారి కుమారులు ఆనందరావు, అప్పారావులు 1983లో శ్రీతలుపులమ్మ తల్లి ఫైర్ వర్క్స్ పేరుతో తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తరువాత 2005లో ఆనందరావు నానాజీ ఫైర్ వర్క్స్‌ని ప్రారంభించారు. తరువాత ఆయన కుమారులు ప్రసాద్, కొండలరావులు ఈ కేంద్రాన్ని నిర్వహించగా ప్రస్తుతం కొండలరావు కొనసాగిస్తున్నారు. అదే జువ్విపాడు గ్రామానికి చెందిన పోతురాజు వెంకట్రావు 1996లో త్రిమూర్తులు ఫైర్ వర్క్స్‌ను స్థాపించారు. ఆయన మరణానంతరం ఆయన బావమరిది, రామచంద్రపురం మండల మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్ ఈ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం మండలం తోటపేటలో దవులూరి వెంకట్రాజు 2000లో అమరావతి ఫైర్ వర్క్స్‌ను స్థాపించి నిర్వహిస్తున్నారు. 2022లో ఆంజనేయ ఫైర్ వర్క్స్ అధినేత పెద్దిరెడ్డి సూరిబాబు మృతి చెందడంతో అమరావతి ఫైర్ వర్క్స్‌ను ఆంజనేయ ఫైర్ వర్క్స్‌లో విలీనం చేసి దవులూరి వెంకటరాజు ఆయన కుమారుడు శివ కొనసాగిస్తున్నారు. ద్రాక్షారామకు చెందిన అమ్మావజ్ఝల వెంకట సుబ్రహ్మణ్య శర్మ వెలంపాలెంలో 2008లో ఏవీఎస్ శర్మ ఫైర్ వర్క్స్‌ను స్థాపించారు. పిచ్చుకల తయారీలో మంచి పేరు పొందారు. ఆయన మరణానంతరం ఆ సంస్థ మూతపడింది.

150 ఏళ్ల చరిత్ర

పెద్దిరెడ్డి సూరిబాబు 66 సంవత్సరాల క్రితం ఆంజనేయ ఫైర్ వర్క్స్‌ను ప్రారంభించారు. ఆయన తండ్రిగారి నుంచి వారసత్వంగా ఈ వృత్తిలో అడుగుపెట్టారు. ఆయన కుటుంబానికి బాణసంచా తయారీ రంగంలో 150 ఏళ్ల చరిత్ర ఉంది. ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ, రాజీవ్ గాంధీల సమక్షంలో బాణసంచా కాల్చారు. ఢిల్లీలో వారి ప్రదర్శన చూసి సిమ్లా ముఖ్యమంత్రి తీసుకువెళ్లి అక్కడ బాణాసంచా ప్రదర్శన చేయించుకున్నారు. ద్రాక్షారామలో కార్తిక దీపారాధనకు ఏటా ఆయన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ. దానిని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు వస్తుంటారు. అంతే కాకుండా నేను అమరావతి ఫైర్ వర్క్స్‌ను స్థాపించి సినీ హీరో ప్రభాస్ వ్యక్తిగత ఫంక్షన్లన్నింటికీ మేమే బాణసంచా కాల్పులు జరుపుతాం.

– **దవులూరి వెంకటరాజు(శ్రీను)**, శ్రీఆంజనేయ ఫైర్ వర్క్స్, ద్రాక్షారామ

కొత్తపేట ప్రభల తీర్థానికి..

మా తండ్రిగారి తరువాత బాణసంచా తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాం. కొత్తపేట ప్రభల తీర్థానికి 22 సంవత్సరాలుగా మేమే బాణసంచా ప్రదర్శన చేస్తున్నాం. కోనసీమలో శివరాత్రి, సుబ్రహ్మణ్య షష్ఠి వంటి కార్యక్రమాల్లో ఎక్కువగా మేము ప్రదర్శన ఇస్తుంటాం.

– **జిల్లెల కొండలరావు**, నానాజీ ఫైర్ వర్క్స్, జువ్విపాడు

ఎన్టీఆర్ ప్రమాణ స్వీకారానికి..

పెద్దిరెడ్డి రాంబాబు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రమాణ స్వీకారానికి బాణసంచా కాల్చారు. అప్పటి రోజుల్లో బాణసంచా అంటే తుపాకీ మందుతో తయారు చేసేవారు. మద్రాస్ నుంచి నాయుడు అనే వ్యక్తి వచ్చి రంగుల బాణసంచా, ఇతర కొత్త రకాల తయారీలో శిక్షణ అందించాడు. ఈ చుట్టుపక్కల రంగుల బాణసంచాను మొదట్లో తయారు చేసింది మేమే.. – **పెద్దిరెడ్డి సుబ్బారావు**, ఔలియా బాబా ఫైర్ వర్క్స్, ద్రాక్షారామ

కుమారస్వామి ప్రమాణానికి..

త్రిమూర్తులు ఫైర్ వర్క్స్‌ను తమ బావ పోతురాజు వెంకట్రావు స్థాపించారు. దాని ఏర్పాటులో ఎమ్మెల్యే త్రిమూర్తులు పూర్తిగా సహకరించడంతో ఆయన పేరుతోనే సంస్థ నెలకొల్పారు. ఆయన మరణించిన తరువాత నేను చూసుకుంటున్నాను. కర్ణాటకలో కుమారస్వామి మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు మేము బాణసంచా కాల్చాము. 1998 నుంచి ఉభయగోదావరి జిల్లా స్థాయి పోటీల్లో ఇప్పటి వరకు 49 సార్లు పాల్గొని 48 సార్లు మేమే విజేతలుగా నిలిచాము.

– **వినకోటి శ్రీనివాస్**, మాజీ ఎంపీపీ, జువ్విపాడు

పలువురుకి ఎమ్మెల్సీ పరామర్శ



మండపేటలో సత్యనారాయణమూర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): మాతృ వియోగంతో బాధపడుతున్న పట్టణ వైఎస్సార్ సీపీ నాయకుడు పేపర్తి సత్యనారాయణమూర్తిని బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వర్గ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు, ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ చల్లా రవికుమార్‌ను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పోతంశెట్టి వరప్రసాద్, దూలం వెంకన్నబాబు, అడబాల బాబ్జి, టపా పుల్లేశ్వరరావు, శెట్టి నాగేశ్వరరావు, సూరంపూడి సత్యప్రసాద్, యరమాటి వెంకన్నబాబు, పెంకే గంగాధరం, తణుకు అశోక్ ఉన్నారు.

రవికుమార్‌కు పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మాతృ వియోగంతో బాధపడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వర్గం శాశ్వత ఆహ్వానితుడు డాక్టర్ చల్లా రవికుమార్‌ను బుధవారం పలువురు సామాజిక కార్యకర్తలు, వామపక్ష పార్టీల నేతలు పరామర్శించారు. సామాజిక కార్యకర్తలు పెద్దింశెట్టి రామకృష్ణారావు, ఎం.గౌరవ్, చిట్టూరి సత్యనారాయణ, సీపీఐ నాయకులు గుత్తి నాగేశ్వరరావు, చిట్టూరి నాగేంద్ర ప్రసాద్ మండపేటలోని ఆయన నివాసానికి వెళ్లి సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాయవరం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన బుధవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించే సర్వ సభ్య సమావేశంలో విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వ్యవసాయం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమ తమ శాఖల నివేదికలతో హాజరు కావాలన్నారు.

కూటమి ప్రభుత్వం తక్షణ పరిహారం ప్రకటించాలి



రాయవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాయవరం: ఈ నెల 8న రాయవరంలో చోటు చేసుకున్న ప్రమాద ఘటనలో బాధిత కుటుంబాలకు తక్షణం పరిహారం ప్రకటించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 10 మంది కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎటువంటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదు. దీంతో పీడీఎస్‌యూ, ఏఐకేఎంఎస్, ఎంఆర్‌పీఎస్, ఎస్సీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు బుధవారం రాయవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ధూళి జయరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం తదితరులు మాట్లాడుతూ బాణసంచా ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో యజమాని, మరో తొమ్మిది కూలీలు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల్లో నలుగురు పురుషులు ఉండగా, ఆరుగురు మహిళలు ఉన్నారన్నారు. మృతుల్లో యజమాని మినహా మిగిలిన వారంతా ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారేనన్నారు. నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ, పరిశ్రమలు, అగ్నిమాపక, కార్మిక శాఖల వైఫల్యం కన్పిస్తుందని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు శనివారం లోపు నష్ట పరిహారం ప్రకటించకుంటే బాధిత కుటుంబ సభ్యులతో కలసి ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మృతుల్లో ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, గాయపడిన వారికి ప్రభుత్వం ద్వారా మెరుగైన వైద్యం అందించాలని, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని, జిల్లాలోని అన్ని ఫైర్‌వర్క్స్ యూనిట్లను తక్షణమే తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బీవీ భాస్కరరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాయవరం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, నాయకులు చింతా రాజారెడ్డి, మండపేట ముస్లిం నాయకులు ఎండీ కరీమ్, ఎండీ షఫీ, బీసీ సెల్ నాయకులు ఎం.గణపతిరావు, సీపీఐ నాయకులు చిర్రా జోజిబాబు, పీడీఎస్‌యూ నాయకులు కె.నవీన్, లంక పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



డీఎస్సీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డీవైఈవో రామలక్ష్మణమూర్తి తదితరులు

రాయవరం: నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికై విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డీవైఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తమ విద్యుక్త ధర్మాన్ని పాటించాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా విధి నిర్వహణ చేసిన వారికి సమాజంలో గుర్తింపు దానికదే వస్తుందన్నారు. డీఎస్సీలో ఎంపికై మండలంలో వివిధ పాఠశాలల్లో వివిధ క్యాడర్లలో నియమితులైన వి.సోమశేఖర్, ఎస్.సుజాత, పి.నాగేశ్వరరావు, డి.సునీత, ఎం.శ్యాంబాబు, సీహెచ్.అజ్జిబాబు, కె.శ్రీనివాసు, డి.స్వప్న, డి.అనూషగ్లోరీ, ఎస్.బ్రహ్మతేజలను యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి డైరీ, సర్వీస్ రిజిస్టర్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 వైవీవీ సూర్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు కడలి శ్రీనివాస్, జి.మురళీకృష్ణ, ఎస్ఏ రహమాన్, గరగ సీతాదేవి, వి.వీరభద్రరావు, డి.సతీష్, జి.అప్పారావు, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన టీచర్లకు సర్వీసు రిజిస్టర్ల అందజేత



హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులకు సర్వీసు రిజిస్టర్లు అందజేసిన పీఆర్‌టీయూ నాయకులు

రామచంద్రపురం రూరల్: డీఎస్సీ 2025 ద్వారా నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోనికి అడుగుపెట్టిన ఉద్యోగులకు పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సర్వీసు రిజిస్టర్లు అందజేశారు. రామచంద్రపురం మండలం రూరల్‌లో ఎంపికైన 12 మందికి, అదే విధంగా రామచంద్రపురం పట్టణంలో ఎంపికైన 14 మందికి సర్వీసు రిజిస్టర్లు అందజేసి వృత్తిపరంగా అన్ని విధాలుగా పీఆర్‌టీయూ తరపున అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ కోనసీమ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొంగం అమృతరావు, మండల ప్రెసిడెంట్ నాళం శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కొత్తుర్తి భీమశంకరం, సీనియర్ నాయకులు పాపాజీ, పాలూరి గోపాలకృష్ణ, కవల వీరన్న, సీహెచ్ భీమశంకరం, దాకోజు రామదుర్గారావు, పంపన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: మండల పరిధిలోని పాతకోటలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. గతేడాది వంతెన శిథిలావస్థకు చేరిందని నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అటు ప్రయాణికులు, ఇటు గ్రామస్తులు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి శిలాఫలం ఆవిష్కరించి కొబ్బరికాయ కూడా కొట్టారని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ తర్వాత గ్రాంట్‌ను క్యాన్సిల్ చేయడంతో నిర్మాణం జరగలేదని వారు అంటున్నారు. ఏ క్షణమైనా వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన వంతెనను తొలగించి నూతన వంతెన నిర్మాణం జరపాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గొల్లపాలెంలో వ్యాపార సంస్థల బంద్



విష్ణుచక్రరావు మృతికి సంతాపంగా మూసివేసిన దుకాణాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాల్లో బుధవారం వ్యాపార సంస్థలు బంద్ నిర్వహించాయి. దేగలపేటకు చెందిన మండల వర్తక సంఘం సభ్యుడు, శలపాక మాజీ గ్రామ సర్పంచ్ గుండా విష్ణుచక్రరావు(60) రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. సుమారు 40 సంవత్సారాల క్రితం గొల్లపాలెం మార్కెట్ సెంటరులో ఒక చిన్న బడ్డీకొట్టులో స్వీట్ స్టాల్‌ను ఏర్పాటు చేసిన ఆయన అంచెలంచెలుగా వ్యాపారాన్ని విస్తరించి కాకినాడ, కోటిపల్లి రహదారిలోని ఒక భవంతిలో భక్తాంజనేయ స్వీట్ హోమ్‌ను నిర్మించారు. విష్ణుచక్రరావు వద్ద పని నేర్చుకున్న ఎందరో యువకులు ఆయన ప్రోత్సాహంతో జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, ప్రధాన గ్రామాల్లో సొంతగా వ్యాపారాలు స్థాపించారు. 2012లో ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేసి 2013 నుంచి 2018 వరకూ శలపాక మాజీ గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. వర్తక సంఘ నిర్వహణలో కీలకంగా వ్యవహరించే విష్ణుచక్రరావు అకాల మరణానికి సంతాపంగా వర్తక సంఘం బుధవారం బంద్ ప్రకటించింది. కాకినాడ, కోటిపల్లి రహదారిలోనూ, పలు ప్రధాన వీధుల్లోనూ ఉన్న దుకాణాలతోపాటు పలు వ్యాపార సంస్థలు, ప్రైవేటు కార్యాలయాలు స్వచ్ఛందంగా తమ కార్యకలాపాలను మూసివేశాయి.

కలాం అందరికీ ఆదర్శం



మండపేటలో చిన్నారులకు సైన్స్ సంగతులు చెబుతున్న శ్రీనివాస్

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రవేత్తగా ఏపీజే అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శమని అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆర్ఎంటీసీ, కలాం సన్నిహితులు సంకురాత్రి గంగాధర శ్రీనివాస్ అన్నారు. మండపేట పట్టణంలోని ఎంపీఎస్ పాఠశాలలో బుధవారం అబ్దుల్ కలాం 94వ జయంతి పురస్కరించుకుని అవగాహన సదస్సును నిర్వహించారు. గంగాధర శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి భారతీయ విద్యార్థి సైన్స్ పట్ల మక్కువ కనబర్చాలని కలాం ఆరాటపడేవారన్నారు. రాష్ట్రపతి పదవి నిర్వహణ కన్నా విద్యార్థులకు సైన్స్ సంగతులు చెప్పేందుకు అమితానందం పొందేవారన్నారు. ఆయన ఆశయాన్ని ప్రతి విద్యార్థి సాధించే దిశగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు అడిగిన సైన్స్ సంబంధిత అనుమానాలను శ్రీనివాస్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత వల్లూరి చిన్నారావు, ఉపాధ్యాయులు ఆయనను సత్కరించారు.

ఉపాధ్యాయులకు డైరీల పంపిణీ



నూతన ఉపాధ్యాయులకు డైరీలు అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కె.గంగవరం: నూతనంగా విధుల్లోకి జాయిన్ అయిన ఉపాధ్యాయులకు బుధవారం యూటీఎఫ్ నాయకులు డైరీలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని కూళ్లలో జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మాగాపు ప్రదీప్‌కుమార్, మండల శాఖ గౌరవ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఎస్.రవి పాల్గొన్నారు. తొలుత నూతన ఉపాధ్యాయులు స్వాగతం పలికి అనంతరం వారిని శాఖకు సంబంధించిన డైరీని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో మంచిగా రాణించాలని కోరారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేసి వారి తల్లిదండ్రులు, గ్రామస్తుల మన్నలను పొందాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ శాఖ ముందుటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరి టి.గణేష్, సభ్యులు ప్రేమ్ కుమార్, ఎం.వీరబాబు, జి.సతీష్ కుమార్, సీహెచ్ రామ్మోహనరావు, కె.శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

మలికిపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మలికిపురం మండలంలో లక్కవరం, గొల్లపాలెం గ్రామ పంచాయతీల వద్ద వెరిఫికేషన్ సభలు నిర్వహించారు. దీని నిమిత్తం ఢిల్లీ నుంచి కేంద్ర తనిఖీ బృందం హాజరైంది. ఎంపీడీఓ సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఏపీఓ లక్ష్మి, ఏపీఎం సయాద్, గ్రామ సర్పంచ్‌లు కోట పుష్పకుమారి, మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్ట అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సమస్యలు పరిష్కరించాలి

అంబాజీపేట: పాఠశాలల్లో ఎదుర్కొంటున్న విద్యా సమస్యలను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చెవ్వూరి రవి డిమాండ్ చేశారు. అంబాజీపేట మండల విద్యా కేంద్రంలో జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ 30 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉమ్మడి సీనియారిటీ పదోన్నతులకు ప్రతిబంధకంగా తయారైందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ కల్పించాలన్నారు. విద్యేతర కార్యక్రమాలను తగ్గించి ఉపాధ్యాయులకు తగినంత బోధన కల్పించాలన్నారు. అనంతరం రవిని ఎంఈఓలు, హెచ్ఎంలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో జిల్లా ఏపీహెచ్ఎంఏ అధ్యక్షుడు మోకా ప్రకాష్, ఎంఈఓ కాంద్రేగుల వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కొత్తూరులో పిచ్చికుక్క స్వైరవిహారం

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు సెంటర్‌లో బుధవారం సాయంకాలం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. స్థానిక బస్టాండు సెంటర్ నుంచి చింతలూరు కాలనీ వరకూ పరుగులు పెడుతూ ఆరుగురిని కరిచి పరారైంది. గాయపడిన వారిలో పలువురికి రక్తస్రావం కాగా సమీపంలోని పెదపళ్ల పీహెచ్‌సీలో చికిత్స పొందారు. మండలంలోని గ్రామ పంచాయతీలు కుక్కల నియంత్రణ అధికంగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టకపోతే రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు పిచ్చికుక్కను గుర్తించి చికిత్స చేయాలని వారు కోరుతున్నారు.

రాయితీ పశువుల దాణా కేటాయించాలి

మామిడికుదురు: పాడి రైతులకు రాయితీపై అందించే పశువుల దాణాను మామిడికుదురు సొసైటీకి కేటాయించాలని కోరుతూ సొసైటీ చైర్మన్ యాలి శ్రీనివాస్ బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతికి వినతిపత్రం ఇచ్చారు. అమలాపురంలో జేసీని కలసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించిన తరువాత రాయితీ దాణాపై వినతిపత్రం ఇచ్చారు. దీనిపై జేసీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారన్నారు.